ప్రజాశక్తి
ఆదివారం 1 డిసెంబరు, 2024
5
శ్రీకాకుళం



5న సుడా చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా కొరికాన రవికుమార్ ఈ నెల 5న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సుడా ఇన్‌ఛార్జి విసి, జెసి ఫర్మాన్ అహ్మద్‌లు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా టెక్కలిలో మంత్రి అచ్చెన్నాయుడును శనివారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను, జెసిని శనివారం మర్యాదపూర్వకంగా రవికుమార్ కలిశారు.


మంత్రిని సన్మానిస్తున్న రవికుమార్

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

- మత్స్యకారులకు వలలు, తెప్పలు అందిస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు


లక్కివలసలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు, ఎంతటి వారైనా వేలం పాట వేసి బెల్ట్ షాపులు నిర్వహించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. డిపిఎన్ రోడ్డు నుంచి మేఘవరం, బోరుభద్ర, పాతమేఘవరం మీదుగా ఎం.సున్నాపిల్లి వరకు మరమ్మతుల కింద రూ.70 లక్షల నిధులతో 15 కిలోమీటర్లు వరకు రోడ్డు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం అమ్మకాలు ఆన్‌లైన్‌లోనే విక్రయించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు ఒక్క పథకమూ అందించలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వం వలే మరలా కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వలలు, తెప్పలు అందిస్తామని స్పష్టం చేశారు. రూ.64 కోట్లతో ఉపాధి హామీ నిధుల ద్వారా టెక్కలి నియోజకవర్గంలో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామన్నారు.

పింఛను పంపిణీ

మండలంలోని లక్కివలసలో ఎన్‌టిఆర్ భరోసా పింఛను అందజేశారు. అక్కడా మాట్లాడుతూ రెండు నెలలు పింఛను తీసుకపోయినా పింఛను అందజేస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో దొంగ ధ్రువపత్రాలతో పింఛను పొందుతున్న వారిని గుర్తించి రద్దు చేస్తామని అన్నారు. అలాగే వచ్చే నెల నుంచి కొత్త పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే, వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి మంజూరు చేస్తామన్నారు.

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులపై సమీక్ష

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా తన పూర్తిచేయాలని మంత్రి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూమితో పాటు, రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని కూడా నివేదిక రూపంలో తయారు చేసి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి సంబంధించి గ్రావెల్, ఇసుక వంటివి అవసరమని మంత్రికి వివరించారు. వంశధార కాలువను త్వరలో ఆధునికీకరించి హిరమండలం నుంచి మేఘవరం వరకు గంటలో నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు గమనించి ఉచిత ఇసుక అందించిన ఘనత సిఎం చంద్రబాబుకే చెల్లిందన్నారు.

బోరుభద్ర పిహెచ్‌సి సందర్శన

మండలంలోని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. డాక్టర్ దేవీవనిత సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు మంత్రికి తీసుకొచ్చారు. బోరుభద్ర ఆరోగ్య కేంద్రంలో జీతం తీసుకుంటూ వేరే దగ్గర పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ జ్ఞానేశ్వరిని రప్పించాలని స్థానికులు మంత్రికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ఆమె ఇక్కడే పనిచేలా చూడాలని పక్కనే ఉన్న కలెక్టర్‌కు ఆదేశించారు. అనంతరం బోరుభద్ర కూడలిలో టెక్కలి డిపోకు చెందిన 8 ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎంపిడిఒ జయంతిప్రసాద్, టిడిపి నాయకులు కింజరాపు హరిప్రసాద్, జీరు భీమారావు, చిదపాన ధర్మార్జునరెడ్డి, అట్టాడ రాంప్రసాద్, మోడి రామచంద్రరావు, రెడ్డి అప్పన్న, పిట్ట రాజులు, శ్రీరంగం ఎర్రయ్య, శ్రీరంగం రాజులు, పరపటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సూరాడ భీమారావు పాల్గొన్నారు.

రెప్పపాటులో ఘోరం

- పోలిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృత్యువులోనూ వీడని భార్యాభర్తల బంధం
- ప్రాణాలు విడిచిన స్నేహితులు
- శ్రీకాకుళంలో విషాదఛాయలు

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి జాతీయ రహదారిపై శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం నగరానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఇద్దరు దంపతులు కాగా, ఇద్దరు ప్రాణ స్నేహితులు, డ్రైవరు ఉన్నారు. ఈ ఘటన శ్రీకాకుళం నగరానికి చెందిన వ్యాపార కుటుంబాలతో పాటు విన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే...




జయేష్   కౌశిక్ (ఫైల్)   అభినవ్, మణిమాల దంపతులు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అప్పుడే తెలతెల్లవారుతోంది... తుపాను ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నాయి. అయినా దైనందిన కార్యక్రమాల్లో భాగంగా తమ పనులను చక్కదిద్దుకునేందుకు ఇంటి నుంచి కారులో బయలు దేరారు ఆనలుగురు. సుమారు 80 కిలో మీటర్లు దూరం ప్రయాణించిన వారికి మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో ఆవహించింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ వార్త విన్న అటు కుటుంబ సభ్యులతో పాటు సిక్కోలు ప్రజలను కలవరపరిచింది. ఈ ఘోరమైన ఘటనలో నగరానికి చెందిన బంగారం వ్యాపారి లంక గాంధీ అల్లుడు గయిడి కౌశిక్ (27), లియో లేబొరేటరీ అధినేత డాక్టర్ వడ్డి మన్మథరావు కుమారుడు వడ్డి అభినవ్, కోడలు మణిమాలతోపాటు డ్రైవర్ జయేష్ దుర్మరణం చెందారు. దీంతో మృతుల కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు పోలిపల్లి అదుపు తప్పి అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లి బోల్తాపడింది. ఆ సమయంలో అటుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. లారీ బలంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. మృతదేహాలు చెల్లా చెదుయ్యాయి. మృతి చెందిన గాయిడి కౌశిక్, వడ్డి అభినవ్‌లు చిన్న నాటి నుంచీ ప్రాణ స్నేహితులు. వీరి విద్యాభ్యాసం, వ్యాపారం అన్నింటా మనసు విప్ప మాట్లాడుకునేంత బంధం వీరిద్దరి. మృతుల్లో మరొకరు అభినవ్ భార్య మణిమాల బిటెక్ పూర్తి చేసింది. ఈమె బ్యాంకు ఉద్యోగాన్ని సాధించాలన్న పట్టదలతో పరీక్ష రాసేందుకు సిద్ధపడింది. భార్య పట్టదలను చూసి ఆమెను భర్త అభినవ్ ప్రోత్సహించేవాడు. ఇలా ఈ రెండు కుటుంబాల్లో చర్చించుకునే అంశమే ఈ ప్రయాణం. శుక్రవారం రాత్రి తన మేనమామను ఎయిర్ పోర్టు నుంచి రిసీవ్ చేసుకునేందుకు విశాఖ వెళ్తున్నట్లు కౌశిక్ చెప్పడంతో తన భార్య మణిమాల పరీక్ష గురించి చర్చించుకున్నారు. శనివారం తెల్లవారు జామున తన డ్రైవరు జయేష్‌ను కారుతో సిద్ధం కావాలని చెప్పిన కౌశిక్ చెప్పి బయలు దేరారు. అరగంట వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో వీరంతా ప్రాణాలు కోల్పోయారు.

మృతుల్లో ఉన్న డ్రైవరు జయేష్ నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. అతని తల్లి నగరంలో టీకొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. తండ్రి చిన్నతనంలోనే కాలం చెల్లడంతో జయేష్ తన తల్లికి అండగా నిలిచేందుకు డ్రైవింగ్ వృత్తిలో ప్రావీణ్యం పొందాడు. అందులో బాగంగా కౌశిక్ వాహనాన్ని నడిపేందుకు వెళ్లాడు. ఆయన మృతితో అతని తల్లి ఒంటరిదైంది. కౌసిక్ కుటుంబ నేపథ్యం బంగారం వ్యాపారమే. అతనికి ఇటీవలే వివాహమైంది. ఆ కుటుంబాల్లో ఇప్పుడు విషాదం నెలకొంది.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వైసిపి కౌన్సిలర్ల వాకౌట్

ప్రజాశక్తి- పలాస

ఫొటోకాల్ ఉల్లంఘన, సభ్యుల అభిప్రాయాలు తెలుసుకోకుండా అజెండాలో అభివృద్ధి కార్యక్రమాలు అజెండాలో పెట్టడంపై నిరసిస్తూ వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. అంతకుముందే ఫొటోకాల్ ఉల్లంఘనపై సభ్యులు లేవనెత్తిన అంశంపై మున్సిపల్ ప్రథమ పౌరుడిగా తానూ బాధితుడేనని, ఫొటోకాల్ ఉల్లంఘన మరోసారి జరిగితే తానూ చైర్మన్ కుర్చీలో కూర్చోకుండా నిరసన తెలుపుతానని చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గిరిబాబు అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండా ప్రారంభించిన వెంటనే కౌన్సిలర్లు కర్రి మాధవరావు, దుర్గా శంకర్‌పండా, గుజ్జు జోగారావు, పప్పల ప్రసాద్, బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా మున్సిపాలిటీలో పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు అజెండాలో పొందుపరిచారని అన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే 15వ ఆర్థిక సంఘం నిధులపై కౌన్సిలర్లతో ముందుగా ఒక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలూ తెలుసుకోవాలని అన్నారు. అలా కాకుండా కౌన్సిలర్లు అనే గౌరవం లేకుండా ఇష్టారాజ్యంగా పనులు పెట్టారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో జనరల్ ఫండ్ ద్వారా ఆమోదం పొందిన పనులు, ఒక వార్డును మరో వార్డుగా మార్చి పనులు అజెండాలో పెట్టారని పేర్కొన్నారు. రూ.85 లక్షలు నిధులు వస్తే ఒక్కో వార్డుకు రూ.లక్ష, రెండు లక్షలు పనులు చేపట్టడం సరికాదన్నారు. ఎంత అవసరమైనా గంట ముందు అత్యవసర సమావేశం నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఇలా అయితే ఎలా.. అని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ ఎన్.రామారావు సమాధానం చెబుతూ నిధులు వెనక్కి మళ్లే అవకాశం ఉందనే భావనతో సమయం లేకపోవడంతో సమాచారం లేకుండా తాము పంపించామని తెలిపారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ అదే విషయం తానూ అడిగానని అన్నారు. దీనిపై వైసిపి సభ్యులు 1 నుంచి 4 అంశాలు వరకు తాము వ్యతిరేకిస్తున్నామని వాకౌట్ చేశారు. ఫొటోకాల్ ఉల్లంఘన, కౌన్సిలర్లు చెప్పకుండా పనులు చేపట్టడంపై హక్కులను కాలరాస్తున్నారని పెద్దగా నినాదాలు చేస్తూ... బయటకు వెళ్లిపోయారు. సభ్యులంతా వెళ్లిపోవడంతో 1 నుంచి 4 అంశాలు రద్దు చేసి మిగిలిన అంశాలను ఆమోదించినట్లు చైర్మన్ ప్రకటించారు. సమావేశంలో బోర చంద్రకళ, బి.సుజాత, బల్ల రేవతి, శార్వాన గీత, పోతనపల్లి ఉమాకుమారి, దుర్గాశంకర్‌పండా, పప్పల ప్రసాద్, కర్రి మధవరావు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ పాల్గొన్నారు.


ప్రశ్నిస్తున్న వైసిపి కౌన్సిలర్లు, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

ఒంటరి ఇళ్లు, మహిళలే లక్ష్యం

- చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు
- రూ.33.03 లక్షల నగదు, 31 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ, జలుమూరు, నరసన్నపేట, టెక్కలి, శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఒంటరి ఇళ్లు, మహిళలే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడారని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. లావేరు మండలం అదపాక, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం తాలాడ గ్రామాలకు చెందిన పిన్నింటి సంతోష్, గట్టిమ ఆనంద్, రాగోలు రాంబాబులను చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముగ్గురు నిందితులూ 15 చోరీలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. వారి నుంచి రూ.33.5 లక్షల నగదు, 31తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. సరుబుజ్జిలి కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా... బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను పట్టుకుని విచారించామన్నారు. వారు చోరీ సొత్తును ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో విక్రయించేందుకు వెళ్తుండగా పట్టుబడినట్టు వివరించారు. వీరిపై విజయనగరం జిల్లాలో కూడా పలు కేసులు నమోదయ్యాయని అన్నారు. పట్టుబడ్డ నిందితులు రాత్రి సమయాల్లో కారును అద్దెకు తీసుకుని వెళ్తుంటారని అన్నారు. ఇంటికి దూరంగా కారును నిలిపి కాలినడకన నిద్రిస్తున్న సమయానికి ఇంట్లోకి ప్రవేశించేవారని వివరించారు. చోరీలకు పాల్పడినప్పుడు నిద్రిస్తున్న మహిళల మెడలో ఉన్న వాటిని తెంపుకుని వెళ్లడం, తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీకి పాల్పడినప్పుడు బీరావాలను ఇంటికి దూరంగా తీసుకెళ్లి పొలాల్లో వాటిని పగలగొట్టి సొత్తును తీసుకెళ్లి పోవడం వారి నైజమని చెప్పారు. గతంలో పిన్నింటి సంతోష్ వేర్వేరు వ్యక్తులతో కలిసి 20 నేరాలకు పాల్పడినట్టు తెలిపారు. కేసుల్లో నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఇన్‌స్పెక్టర్లు పైడపు నాయుడు, సూర్యచంద్ర, జె.శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ, ఎస్.బాలరాజు, ఎస్‌ఐలు సిహెచ్.దుర్గాప్రసాద్, కె.కృష్ణప్రసాద్, కె.మధుసూదనరావు చురుగ్గా వ్యవహరించడంతో వారిని అభినందించారు.


నిందితులను ప్రవేశపెట్టిన ఎస్‌పి మహేశ్వర రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో మతవిద్వేషాలు రగిలించి సామరస్యాన్ని శాంతిని భంగపరిచే మతోన్మాద శక్తులను అడ్డుకుని మహాకవి గురజాడ అప్పారావు బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు పేర్కొన్నారు. గురజాడ 109వ వర్థంతి సందర్భాన్ని పురస్కరించుకుని సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఆయన రాసిన దేశభక్తి గీతాన్ని పాడుతూ నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్‌సిసి విద్యార్థులు, యువతతో కలిసి సభ నిర్వహించారు. ఈ సభకు సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి అట్టాడ అప్పలనాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తిలు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ గురజాడ రచనలు దేశభక్తిని, మహిళా ఉద్ధరణ, అణగారిన తరగతుల అభ్యున్నతిని, నిరుద్యోగ నిర్మూలనని కాంక్షించాయని అన్నారు. కవి కంచరాన భుజంగరావు మాట్లాడుతూ రచనకు సంబంధించిన అన్ని ప్రక్రియల్లోనూ గురజాడ ఆద్యుడని పేర్కొన్నారు. కవిత గేయం, కథ, నాటకం, వ్యాసాలు, అనువాదాలు అన్నిటిలోనూ గొప్ప ప్రమాణాలు నెలకొల్పారని అందుకే ఆయన కవి శేఖరుడు వైతాళికుడు అయ్యారన్నారు. ఎన్‌సిసి కమాండెంట్ డాక్టర్ వై.పోలినాయుడు మాట్లాడుతూ తెలుగు భాషకు గురజాడ గొప్ప సేవ చేశారని, ఆ భాషను ప్రస్తుతం బతికించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. యువత ఆ కర్తవ్య దీక్షలో ముందుకు సాగాలని పిలిపిచ్చారు అంతర్జాతీయ స్థాయి కవి అయిన గురజాడకు తగిన నివాళి దేశం ఇవ్వాల్సి ఉందన్నారు కార్యక్రమంలో సాహితీ స్రవంతి నాయకులు బాడాన శ్యామలరావు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, నెట్టిమి రమణ, పూజారి దివాకర్ డి.రామకృష్ణ, విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు ఎం.ప్రభాకర్, పి.సుధాకరరావు, మహిళా నాయకులు కె.నాగమణి, విద్యార్థి నాయకులు సంతోష్, జనార్ధన్, గాయకులు చింతాడ రామచంద్రరావు పాల్గొన్నారు.

తీరంలో పులి అడుగుజాడలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని తీరప్రాంత గామాలైన మెట్టూరు, ఒంటలూరు చీపురుపల్లి గ్రామాల రహదారుల్లో పులి అడుగు జాడలు కనిపించాయి. పెద్ద పులి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సమాచారం అందుకున్న పలాస అటవీశాఖాధికారి పోలయ్య శనివారం సాయంత్రం పులి పాదాలను పరిశీలించారు. ఇవి పులి అడుగులు కావని, పెద్ద నక్క అడుగులు అయి ఉంటాయని చెప్పారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేపట్టి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉండగా, పులి అడుగుజాడలు కనిపించాయంటూ ప్రచారం కావడంతో యువత అడుగులను చూసేందుకు ఎగపడ్డారు.


పులి పాదాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి పోలయ్య

గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలి

- వేధింపు కేసుల దర్యాప్తు వేగవంతం
- ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని, అపరిష్కృతంగా ఉన్న మహిళ, చిన్నారుల వేధింపులు సంబంధించిన కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతం చేయాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో పెండింగ్ ప్రజా ఫిర్యాదులు, ఎన్‌డిపిఎస్, మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్, రోడ్డు ప్రమాదాలు నివారణ, తదితర నేరాలకు సంబంధించి కేసులపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్రమైన కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జ్‌షీట్ కోర్టులో దాఖలు చేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే నియంత్రించాలన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంకల్పం పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పాత ముద్దాయిలపై నిఘా ఉంచి వారి కదలికలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. తరచూ సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు వివేకా ఆనంద్, అప్పారావు, రాజశేఖర్, ప్రసాదరావు, ఎఆ గోపీనాథ్ పాల్గొన్నారు.

రాజ్యాంగం గొప్పతనం ఇప్పుడు తెలిసొచ్చిందా?

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అధికారంలో ఉన్నప్పుడు పౌరుల హక్కులపై ఉక్కుపాదం మోపడం, అక్రమ నిర్బంధాలతో స్వేచ్ఛను హరించడం, ప్రతిపక్ష పాత్రలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని, ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛను హరిస్తున్నారంటూ గోల పెడుతుండటం బూర్జువా పార్టీలకే చెల్లుతుంది. వైసిపి ఏలుబడిలో ప్రజా ఉద్యమాలను ఎంతగా అణగదొక్కారో మనం చూశాం. స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు చలో విజయవాడ చేపట్టిన సందర్భాల్లో వారిని ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేసిన ఘటనలు చాలా చూశాం. ఆందోళనలకు పిలుపునివ్వడమే చాలు పోలీసులు వేకువ జామునే సిఐటియు, స్కీం వర్కర్ల ఇళ్ల ముందు వాలిపోయేవారు. ఆంక్షలు తప్పించుకుని ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు బస్సులు, ట్రైన్‌ల్లో వెళ్తున్న వారిని పట్టుకుని పోలీసుస్టేషన్లకు తీసుకొచ్చేవారు. ఆందోళనకారుల కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్లకు తీసుకువెళ్లి, మార్గంమధ్యలో ఉన్నవారిని సైతం ఇళ్లకు రప్పించిన ఘటనలు ఎవరూ మరిచిపోయి ఉండరు. సిపిఎస్ రద్దు కోసం విజయవాడ వెళ్తారన్న సమాచారంతో పోలీసులు ఏకంగా స్కూళ్లకే వెళ్లిపోయారు. పిల్లలకు ఉపాధ్యాయులు లోపల పాఠాలు చెప్తుంటే బయట పోలీసులు కాపలా కాసిన సందర్భాలూ లేకపోలేదు. రాజకీయ ప్రత్యర్థులను ఎంతగా వేటాడిందో వేరే చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడును ఇఎస్‌ఐ మందుల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ పోలీసులు నిమ్మాడలో ఆయన ఇంటిని చుట్టుముట్టి అరెస్టు చేయడంతో పాటు ఆపరేషన్ చేయించుకున్నారన్న కనీసం కనికరం లేకుండా విజయవాడ వరకు వాహనంలో తిప్పింది. శుక్రవారం వస్తే చాలు టిడిపి నాయకులు ఎవరిని ఎక్కడ అరెస్టు చేస్తారో? అని భయభ్రాంతులకు గురి చేసేలా ఎసిబి, సిఐడి పోలీసులను ప్రయోగించింది. నంద్యాలలో చంద్రబాబు అరెస్టు వైసిపి సాగించిన అరెస్టుల పర్వానికి పరాకాష్టగా నిలిచింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెడితే కేసు, జగన్‌ను తిడితే అరెస్టు అన్న రీతిలో నాటి వైసిపి పాలన సాగింది రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందంటూ టిడిపి నేతలు అరిచి గోల పెట్టారు. వైసిపి అధికారంలో ఐదేళ్లూ వారి రక్షణ కోసం రాజ్యాంగాన్ని స్మరించుకున్నారు. రాజ్యాంగ అవతరణ దినోత్సవమైన నవంబర్ 26వ తేదీన టిడిపి శ్రేణులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగం గొప్పదనంపై వివరించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వపరంగా రాజ్యాంగ దినోత్సం చేశారే తప్ప పార్టీ తరుపున ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకపోవడం చూస్తుంటే వారికి రాజ్యాంగం నామస్మరణ పెద్దగా అవసరం లేదా అని జనం అనుకుంటున్నారు.

టిడిపి శ్రేణులపై నాడు వైసిపి ప్రభుత్వం ఏ తరహాలో చెలరేగిందో అదే తరహాలో నేటి కూటమి ప్రభుత్వం ఆ పార్టీ నాయకులకు రుచిచూపిస్తోంది. వైసిపి నాయకులు, శ్రేణులపై కేసుల ఇన్నింగ్ ఇప్పుడిప్పుడే మొదలు పెట్టింది. తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారం చేస్తామంటూ ఒకవైపు చెప్తూనే చట్ట ప్రకారమే కక్ష సాధింపులకు దిగుతున్నట్లుగా పలువురిపై నమోదు చేస్తున్న కేసుల చూస్తే తెలుస్తోంది. వైసిపి నాయకుడు బోరుగడ్డ అనీల్‌పై ఎక్కడిక్కడ కేసులు నమోదు చేసి ఆయన్ను రాష్ట్రమంతటా తిప్పి ప్రత్యక్ష నరకం ఏంటో చూపించాలనుకుంటున్నట్లుగా ఉంది. చంద్రబాబు, లోకేష్‌ను దూషించారంటూ గారలో కేసు నమోదు చేయించి శ్రీకాకుళంలో అరెస్టు చూపించారు. వైసిపికి చెందిన పెద్దిరెడ్డి సుధారాణిని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బత్తిలి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి జిల్లాకు తీసుకొచ్చారు. తప్పు చేసిన వారిని శిక్షించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. వారు ఉన్న ప్రాంతంలో కాకుండా రాష్ట్ర మంతటా కేసులు నమోదు చేయించి అరెస్టులు చేయించడం వంటి కక్ష సాధింపు చర్యలను ప్రజలు స్వాగతించారు. రాష్ట్ర మంతటా తమ నాయకులను, పార్టీ శ్రేణులను అక్రమ అరెస్టులు చేస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందంటూ గోలపెట్టడం ఇప్పుడు వైసిపి వంతయ్యింది. గతంలో టిడిపి వినిపించిన డైలాగ్‌నే ఇప్పుడు వైసిపి వినిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26న ఘనంగా నిర్వహించాలని, కూటమి ప్రభుత్వ అక్రమ అరెస్టులపై నిరసనలు తెలపాలని పిలుపునిచ్చింది. ప్రతిపక్షంలో ఉన్న వైసిపికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఔచిత్యం ఇప్పుడు తెలిసినట్లుంది. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ విమర్శలకు దిగటం మనం చూస్తున్నాం. ధర్మో రక్షిత రక్షిత: అని పెద్దలు ఊరకనే చెప్పలేదు. ధర్మాన్ని (రాజ్యాంగాన్ని) మనం రక్షిస్తే మనల్ని ధర్మం రక్షిస్తుంది.

రాజ్యాంగం అమలుపై టిడిపి, వైసిపి ఒకరినొకరకు నిందించుకుంటూ రాజ్యాంగానికి అసలు ప్రమాదకరంగా ఉన్న బిజెపిని ఇరు పార్టీలు వదిలేస్తున్నాయి. బిజెపికి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ ఒకరిద్దరు బిజెపి ఎంపిలు, నేతలు సార్వత్రిక ఎన్నికల ముందు ప్రకటించడం చూశాం. బహుశా ప్రజలు కూడా రాజ్యాంగానికి బిజెపితో ముప్పు ఉందని గ్రహించినట్లు ఉంది. బిజెపికి 400 సీట్లు కాదు కదా? కనీసం మెజార్టీ సీట్లను ఇవ్వకుండా కర్రకాల్చి వాత పెట్టారు. అయినప్పటికీ బిజెపితో లౌకికవాదానికి ప్రమాదం పొంచే ఉంది. అవకాశం దొరికినప్పుడల్లా మతాల మధ్య చిచ్చు రాజేసి చలి కాచుకోవాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రయత్నిస్తుంటూనే ఉంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటి ప్రయత్నాలను తిప్పిగొట్టాలి.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY COURT AT SRIKAKULAM
IA.No: 508/2024 in CMA.No: 11/2024

Between:-
Surendra Dharmana ...Petitioner/Appellant
And:-
Shree Raghavendra Infracon Visakhapatnam, Rep by its Managing Partner, Polumuru Sombabu & Another.
.....Respondents

To,
R-2: Duda Katyayani Devi, W/o late Bhavani Shankar, R/a Adilakshmi Apartments, New Colony, Srikakulam district.

NOTICE TO THE 2ND RESPONDENT:

It is to inform you that the above IA and CMA i.e IA.508/2024 in CMA.11/2024 on the file of the honorable 3rd additional district judge cum family court at Srikakulam, Srikakulam District is posted to 13-12-2024 for your appearance You are here by directed to appear before the above **court at 10:30 A.M. on 13-12-2024** in person or through advocate without fail otherwise the matter will be decided on your absence

(By order of the Honourable court)

PALISETTI MURALI KRISHNA
ADVOCATE,
SRIKAKULAMCELL: 94 40 371133.


ఇంటింటా వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శనివారం మండల రాపాకలో ఎన్‌సిడి కేన్సర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని ముందుస్తుగా గుర్తించడం వలన పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ఇంటింటా సిబ్బంది చేపడుతున్న టిబి, బిపి, షుగర్ పరీక్షలను ఆమె పరిశీలించారు. అలాగే లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. అనంతరం పొందూరు పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న వైద్య సేవలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు వైద్యాధికారులు డా.రమేష్‌నాయుడు, డా.నవీన్ పవన్ కల్యాణం, డా.శివశంకర్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఆపరేటింగ్ సిస్టమ్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

'ఆపరేటింగ్ సిస్టమ్' అనే పుస్తకం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉందని ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. తన ఛాంబర్‌లో ఆపరేటింగ్ సిస్టమ్ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగానికి చెందిన హెచ్‌డి డాక్టర్ ఎం.వి.బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రదీప్‌కుమార్ మహాపాత్రో, దశరద ఆరంగి, కె.వి.చంద్రశేఖరులు ఈ పుస్తకాన్ని రాశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెడ్డి డాక్టర్ డి.శ్రీరాములు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

విద్యతో పాటు క్రీడలు అవసరం

పలాస: ప్రతి విద్యార్థికి విద్యతో పాటు క్రీడలు అవసరమేనని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలాస ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి అండర్-16 ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ఆటల పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి క్రీడల కోటాలో ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కూడా అందాయన్నారు. అందువల్ల విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమేనని ప్రతి విద్యార్థి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పిఇటిలు పి.తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

సిఎం సహాయనిధి అందజేత

కొత్తూరు : మండలంలోని వలురౌతు తిరుపతిరావు గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రి ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులకు గురవ్వడంతో స్థానిక నాయకులు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకువెళ్లి సిఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల 8, 173 మంజూరు చేశారు. చెక్కును బాధితునికి ఎమ్మెల్యే శనివారం అందించారు. ఈయనతో పాటు ఎండిఒ నీరజ, టిడిపి నాయకులు అగతముడి భైరాగినాయుడు, మాధవరావు, మాతలగాంధీ, వలురౌతు వెంకటరావు, సుధాకర్, నాగళ్ల అప్పన్న, కొయిలాపు సంజీవ్, కమలాకర్ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై అసహనం

ప్రజాశక్తి- మందస

మండలంలోని 41 పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనితీరుపై డ్వామా పీడీ సుధాకరరావు అసహనం వ్యక్తం చేశారు. మందస ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ చేపట్టారు. ఉపాధి పనుల్లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లులు చెల్లించే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలోని 41 పంచాయతీల్లో చేపట్టిన 3,553 పనులకు సంబంధించి చర్చించారు. సరియాపల్లి, బేతాళపురం, బహడపల్లి, మందస, దున్నూరు ఫీల్డ్ అసిస్టెంట్లతో కొందరు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని కూలీలు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బయలు సూర్యనారాయణ, ఎపిఒ హరికృష్ణ, ఎంపిపి దానయ్య, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, మండల యువత అధ్యక్షులు నవీన్, రుద్రయ్య, లింగరాజు పాల్గొన్నారు.

ఆదమరిస్తే నేల బావిలోకే..

ప్రజాశక్తి- లావేరు

రణస్థలం నుంచి రాజాం వెళ్లే ఆర్అండ్‌బి రహదారిలో లావేరు పంచాయతీ కేశవరాయపురం గ్రామం వద్ద గురిజా తవిటయ్య కళ్లం సమీపంలో వ్యవసాయ నేలబావి రోడ్డును ఆనుకుని ఉండడంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాలి. లేదంటే వాహనంతో పాటు నేలబావిలోకి వెళ్లిపోవడం ఖాయమని, అక్కడ రక్షణగోడ నిర్మించాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ రహదారి రాత్రి, పగలు తేడా లేకుండా పరిశ్రమలకు వెళ్లే వారు, ఇతర పనులపై వెళ్లేవారితో రద్దీగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రక్షణగోడ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారిని అనుకుని ప్రమాదకరంగా ఉన్న నేలబావి

ప్రజా సంక్షేమమే ధ్యేయం


కవిటి : పింఛన్లు పంపిణీ చేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని తోటాడలో పింఛనుదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పింఛనుదారుడు మరణిస్తే ఆయన భార్యకు వితంతు పింఛను మరుసటి నెల నుంచే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు బాలకృష్ణ, కూన అమ్మాజీ, తాండ్ర హరిబాబు, ఎంపిడిఒ రోణంకి వెంకటరావు, ఇఒపిఆర్‌డి ఎ.గోపాలరావు, కార్యదర్శులు హరీష్, లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని భీమవరంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పైడి భీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, పెద్ది రాజు, శ్రీనివాస్ రాజు, మొనకాల రమేష్, సింక రామారావు, సంతు రాజు, రణస్థలం సర్పంచ్ బానోజీ నాయుడు, పిసిని జగన్నాధం, గొర్లె సాయిదీప్ నాయుడు, ప్రసాద్, జనసేన నాయకులు వడ్డాది శ్రీను, రామిరెడ్డి, లక్ష్మణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్ : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

లావేరు: మండలం తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడులో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, ఎచ్చెర్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ తొటయ్యదొర, మధుబాబు, కూర్మారావు, మురళీ మోహన్, శ్రీనివాసరావు, మహేష్, తాళ్లవలస ఉపసర్పంచ్ తిరుపతి రావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని ఈదుపురానికి చెందిన 44 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. ఈదుపురంలో కొత్తగా మంజూరైన 44 పింఛన్లతో పాటు గత నెలలో పింఛను తీసుకొని 50 మంది పింఛనుదారులకు, రెండు డయాలసిస్ పింఛన్లను రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అప్పలస్వామి, కవిటి, ఇచ్ఛాపురం ఎంపిడిఒలు శ్రీనివాసరెడ్డి, రామారావు, ఇఒ వీరభద్రస్వామి, ఎపిఎం గోవిందరావు, టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, కామరాజు, వజ్జ రంగారావు, మోహనరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్, రూరల్: మండలం కిష్టప్పపేట, గార మండలం వత్సవలస పంచాయతీ మొగదలపాడులో, అరసవల్లిలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పింఛనుదారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఢిల్లీరావు, ఎంపిడిఒ రామారావు, బి.రాజేంద్రప్రసాద్, అంబట ఈశ్వరావు, యువరాజు, క్షేత్రవాసి బెహరా, అంబటి పురుషోత్తం, బసంతు బెహరా, అంబటి రాజారావు, సంజు రౌలో, భాస్కర్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


లావేరు : పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

పలాస : మండలంలోని కేదారిపుంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఎన్‌టిఆర్ భరోసా పింఛనను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మత్స్యకారకార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్‌కుమార్, ఎంపిడిఒ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి వైకుంఠరావు, ఎపిఎం జాంబవతి పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని గజపతినగరంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఎన్‌టిఆర్ భరోసా పింఛనును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, కాయ రవి, ధర్మాన అమ్మన్నాయుడు, మెండ రాము పాల్గొన్నారు.


పలాస : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

అరసవల్లిలో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం

శ్రీకాకుళం అర్బన్ : అసరవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే సందర్శకులు ఇకపై ప్లాస్టిక్ కవర్లతో వస్తే ఆలయ ప్రవేశం కల్పించడం సాధ్యం కాదని నగరపాలక సంస్థ కమిషనర్ పివివిడి ప్రసాదరావు తెలిపారు. శనివారం అరసవల్లి సందర్శించిన ఆయన ప్లాసిక్ వాడకం నిషేధం అమలుపై ప్రచార పోస్టర్లను, స్లోగన్ కార్డులను విడుదల చేశారు. ఆలయ పరిసరాల్లో స్లోగన్ కార్డులను అమర్చి యాత్రికులకు అవగహన కల్పించారు. ఆదివారం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ బోర్డులను క్యూలైన్ల వద్ద ఆలయ పరిసరాల్లో అమర్చారు. డిశంబరు 1 నుంచి కవర్ల వాడకం నిషేదాన్ని అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్ రామకృష్ణ

ఆదివాసీ హక్కులపై అవగాహన

కొత్తూరు : మండలం అల్తీ పంచాయతీ వెలుగు అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంక్షేమ పథకాలు, ఆదివాసీ హక్కులపై సచివాలయ సిబ్బందితో పంచాయతీ స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ ఆధార్, జనన, మరణ ధ్రువపత్రాలు, పింఛను, గిరిభూమి పోర్టల్‌లో నమోదైన తప్పులను సరిచేయుటపై అవగాహన కల్పించారు. గిరిపోర్టల్‌లో నమోదు కాని వారు నమోదు చేసుకోవాలని లేకుంటే సంక్షేమ పథకాలు, రాయితీలు రావన్నారు. అలాగే ఎన్‌పిసిఐ, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర ఎలిస్వేని, విజయకుమార్, ఆఫీసురావు తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై దృష్టి సారించాలి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

టిడిపి ప్రభుత్వం గత 43 ఏళ్లుగా రైతులకు అండగా ఉంటోందని, గత ప్రభుత్వం బిందు- తుంపర సేద్యంపై రాయితీ ఎత్తివేసి ఆ పథకాలు నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం మళ్లీ రాయితీ కల్పించి రైతులకు అందిస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలం రామయ్యపుట్టుగలో బిందు, తుంపర సేద్యం పరికరాలను శనివారం రైతులకు రాయితీపై అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వినియోగించుకుని రైతులు బిందు సేద్యం, తుంపర సేద్యం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 100 హెక్టార్లకు సంబంధించి బిందు, తుంపర సేద్యం కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. బిందు సేద్యం పరికరాలు ఐదు ఎకరాలకు లోపల భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీతో, ఐదు ఎకరాలకుపైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తుంపర సేద్యం పరికరాలు ఐదు ఎకరాల లోపల 55శాతం, ఐదు ఎకరాలకు పైబడిన రైతులకు 45 శాతం రాయితీతో అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అప్పలస్వామి, ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మాధవి లత, టిడిపి నాయకులు, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, ఆరింగి మధు, బెందాలం కామరాజు, వజ్జ రంగారావు, ఎఇఒ శ్రీ కళ్యాణ్, ఎంఐఎఒ శరణ్య, ఎంపిఇఒ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లో నగదు జమ చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం రిట్టపాడులో రైతుసేవా కేంద్రల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి కూడా సకాలంలో రైతులకు సాగునీరు అందించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. మండలంలో దేవునల్తాడ, పాత టెక్కలి, అనంతగిరి, నగరంపల్లి, బాతుపురం రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో 1100 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, దున్న షణ్ముఖరావు, గొనప నిరంజన్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.వి. మధు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, తహశీల్దార్ సీతారామయ్య, వ్యవసాయశాఖ అధికారి కిరణ్‌వాణి తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కౌన్సిల్‌కి చెప్పకుండా రూ.2 కోట్ల పనులా?

అభ్యంతరం వ్యక్తం చేసిన వైస్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.2 కోట్లు విలువచేసే అభివృద్ధి పనులు కౌన్సిల్‌కి చెప్పకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి ముందస్తుగా అనుమతి ఇవ్వడంపై వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తం చూశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు, అభివృద్ధి ప్రణాళిక ఆమోదంపై ముందుగా కౌన్సిల్‌తో చర్చించి ఎజెండాలో పెట్టి ఉంటే బాగుండేదని అన్నారు. అలా కాకుండా చైర్‌పర్సన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై తాను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు స్వర్ణమణి తెలిపారు. వార్షిక అభివృద్ధి ప్రణాళికను కౌన్సిల్ ఆమోదించింది. వార్డు కౌన్సిలర్ మధుమూర్తి మాట్లాడుతూ తన వార్డులో మరో రూ.5 లక్షలు కేటాయింపు చేయాలని కోరారు. పట్టణ ప్రణాళిక సర్వే చెసి గుర్తించిన 68 ప్రాంతాల్లో నెట్‌వర్క్ ప్లాన్లను ప్రాంతీయ ఉప సంచాలకులు ఆమోదం కోసం పట్టిన ప్రతిపాదనలను కౌన్సెల్ ఆమోదించింది. కొత్తగా రూపొందించిన ప్లాన్ వివరాలు ను కౌన్సిల్ సభ్యులకు అందించాలని మధుమూర్తి, లీలారాణి కోరారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయింపుపై కౌన్సెల్ ఆమోదించింది. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ మరమ్మతు చేపట్టే షాపులకు మాత్రమే ఒకదాని తరువాత మరొకటి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో సంతపేట పంప్‌హౌస్ వద్ద మున్సిపల్ ఖాళీ స్థలంలో పశువులు నిలుపుదల చేయడానికి కంచే నిర్మించేందుకు రూ.3.50 లక్షలు కేటాయించడంపై సభ్యుడు బచ్చు జగన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ... ఇంకా తగ్గిస్తే మంచిదని సూచించారు. అనంతరం నిర్వహించిన జీరో అవర్‌లో సభ్యులు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు ప్రతి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

గృహ నిర్మాణాలకు సహకారం

ప్రజాశక్తి- బూర్జ

సొంతింటి కల నెరవేర్చుకోవాలని అందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని గృహ నిర్మాణశాఖ ఎఇ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. తమ సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు తమకు దరఖాస్తు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.2 లక్షల 50 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే స్థలం లేని వ్యక్తులు తమకు దరఖాస్తు చేసుకుంటే స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కులగణన చేపట్టాలి

నందిగాం: వచ్చే ఏడాది నుంచి చేపట్టబోయే జనగణనతో పాటు భారతదేశ వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిల కులగణనను విధిగా చేపట్టాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1951 తర్వాత కేవలం ఎస్‌సి, ఎస్‌టి జనాభా మాత్రమే లెక్కించారని గుర్తు చేశారు. మిగతా తరగతుల సమాచారాన్ని సేకరించలేదని, అదీ చట్టసభల్లో ఎస్‌సి, ఎస్‌టి స్థానాలను నిర్ణయించడానికే పరిమితం చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నైపుణ్య కోర్సులపై శిక్షణ

టెక్కలి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ వాయిస్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణఇుంటుందని పేర్కొన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత

పలాస : మండలంలోని గురుదాసుపురం పంచాయతీ చిన్నసున్నాదేవికి చెందిన పైల గున్నమ్మ కిడీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. విషయం తెలుసుకున్న ఉద్యానవనశాఖ సహాయక విస్తరణాధికారి నవీన్ చౌదరి శనివారం గున్నమ్మకు ఫించను అందజేశారు. నవీన్‌కు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు ఎస్.రాజారావులు అభినందించారు.

బాబూరావు మాస్టారు ఆదర్శనీయులు


మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ప్రజాశక్తి- సోంపేట

కర్తలపాలెం పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పొందూరు బాబురావు మాస్టారు నేటి తరానికి ఆదర్శనీయని వక్తలు కొనియాడారు. బాబురావు మాస్టారు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ, పురజనులు కలిసి శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పలాస డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పి.విలియం, గురజాడ బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ అంబటి రంగారావు, ప్రముఖ లాయర్ పృధ్వీరాజ్, గల్ఫ్ జర్నలిస్ట్ ముక్కేర్ల వాసుదేవరావు, ఎంపిపి నిమ్మన దాసు, మాజీ ఎంపిపిలు మంగి గణపతి, మంగి ధనలక్ష్మి, స్టీల్ ప్లాంట్ మేనేజర్ టి.శ్రీనివాసరావు హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం ఎస్.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎంఆర్‌పిగా, మోటివేటర్‌గా అత్యద్భుతమైన సేవలు అందించారన్నారు. బాబురావు మాస్టార్‌కు విద్యాబుద్ధులు నేర్పించిన చిన్ననాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొందూరు గున్నయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


గుర్తు తెలియని మృతదేహం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పైడిభీమవరం సాహు దాబా హోటల్ సమీపంలో శనివారం రాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న రోడ్డులో గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్టు జెఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వృద్ధుడు వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుందని, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

గంజాయి నిర్మూలనలో భాగంగా ఆంధ్ర-ఒడిశా బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద శనివారం స్థానిక పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తుండగా విశాఖపట్టణానికి చెందిన ఒక వ్యక్తి నాలుగు మద్యం సీసాలను తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్టు ఎఎస్ఐ కృష్ణారావు తెలిపారు.


బూర్జ : సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

జోరుగా సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో టిడిపి నాయకులు శనివారం ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బిసిసెల్ మండల అధ్యక్షులు మామిడి దుర్గారావు ఆధ్వర్యంలో బొమ్మిక గిరిజన గ్రామంలో టిడిపి సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసిరెడ్డి వెంకు నాయుడు, ఊయక రామారావు, మహిళలు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. మండలంలోని కె.కొత్తూరులో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రజాశ్రేయస్సుకు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, నాయకులు మక్క శంకరరెడ్డి, టంకాల బాబ్జి, లోపింటి సూర్యనారాయణ, ధర్మాన రాజు పాల్గొన్నారు.


నాట్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న కళాకారులు

బ్రహ్మోత్సవాలకు ఇచ్ఛాపురం కళాకారులు

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఇచ్ఛాపురం చిన్నారులకు మరోసారి అవకాశం వచ్చింది. డిసెంబర్ 2, 3న శిల్పారామం వేదికపై, 5న అమ్మవారి వాహన సేవలో చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శన జరుగుతున్నట్టు అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన దేవస్థానం యాజమాన్యానికి, నాట్య గురువు ఏలేశ్వరపు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాట్యంలో పాల్గొంటున్న చిన్నారులు, నాట్య గురువు శృతి పట్నాయక్, నీలాపు శైలు, చాట్ల విజయలక్ష్మి, ఆసీపు శ్వేతారాణి, కొరివి జాగృతి, నీలాపు ప్రీతి, నీలాపు కుసుమ, పల్లవి, నికిత, మధుశ్రీ, దీక్షిత, జైత్రి కాత్యాయని, సంజన, స్రవంతి, హారిక, తనుశ్రీ, శోభన, జ్వాలా సాయి, అక్షిత, కావేరి, రమ్యశ్రీ, సౌమ్య, సాన్విక, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొంటున్నారు.

కళాంజలి థియేటర్ సీజ్

పొందూరు: మండల కేంద్రం పొందూరులో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాంజలి థియేటర్‌ను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. థియేటర్ యాజమాన్యం 2023-25 సంవత్సరానికి ఫారం-బి లైసెన్స్‌ను రెన్యువల్ చేయాల్సిందిగా ఆర్‌డిఒకు దరఖాస్తు చేశారు. కానీ, సరైన నిబంధనలు పాటించని కారణంగా అధికారులు రెన్యువల్ చేయలేదు. గతంలోను థియేటర్ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్నట్లు పట్టణానికి చెందిన బి.దామోదరరావు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఫారం-బి లైసెన్స్ రెన్యువల్‌కు పాటించాల్సిన నిబంధనలు పాటించడం లేదంటూ శ్రీకాకుళం ఆర్‌డిఒ థియేటర్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. తక్షణమే థియేటర్‌ను సీజ్ చేయాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ ఆదేశాల మేరకు థియేటర్ యాజమాన్యానికి నోటీసులు అందించి శనివారం రాత్రి సీజ్ చేసినట్లు తహశీల్దార్ వెంకటేష్ తెలిపారు. దీంతో థియేటర్ మూతబడింది.

ఆకాశవాణిలో లలితారెడ్డి ఇంటర్వ్యూ

జి.సిగడాం: మహాకవి, నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలులో సంస్కరణ వాదం' అనే అంశంపై జి.సిగడాం కెజిబివి తెలుగు ఉపాధ్యాయులు, రచయిత్రి లలితారెడ్డి ఆదిలాబాద్‌లో ఆకాశవాణికి శనివారం ఇంటర్వ్యూ నిర్వహించారు. గురజాడ 109వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటైంది. పూర్ణమ్మ గేయం, కన్యకలో పట్టమేలే రాజు గర్వం.. అంటూ గురజాడ రాసిన ఈ గేయాలను విశ్లేషించారు. ముత్యాలసరాలు అనే నూతన చందస్సులో రాసి, సమాజంలో గూడుకట్టుకుని ఉన్న దూరాచారాలను రూపుమాపాలని ఆయన ఎలుగెత్తి చాటారని లలితా రెడ్డి తన ఇంటర్వ్యూలో వివరించారు. ఈమెకు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల, తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి. రమణమూర్తి ఆమెను అభినందించారు.

తిలక్ పరామర్శ

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస పంచాయతీ వార్డు సభ్యులు కొర్రాయి శాంతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ మృతురాలి భర్త కూర్మారావును శనివారం పరామర్శించారు. శాంతి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, సర్లాన సుధాకర్ ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి- పలాస

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకొనేందుకు సిద్ధం కావాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణంలో మత్తు పదార్థాల వ్యతిరేకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యతేజ, విద్యా వాహిని, ప్రభుత్వ ఐటిఐ, ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు నినాదాలు చేస్తూ... శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సాహిదాభి ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కృష్ణారావు, ధర్మారావు, కాంతమ్మ, సిఐటియు గణపతి, సిపిఎం నాయకులు చాపర వేణుగోపాల్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, జిల్లా ఐద్వా నాయకురాలు జి.సుగుణావతి, భాగ్యలక్ష్మి, ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్, ఎపి జీడి రైతాంగం నాయకులు తెప్పల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల సామూహిక ప్రతిజ్ఞ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో జ్ఞానభారతి సిబిఎస్‌సి సీనియర్ సెకండరీ పాఠశాలలో పరోపకార దినం- సద్భావన దినోత్సవాన్ని సిఇఒ జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. కీర్తిశేషులు పరిపాలన అధికారి ప్రేమ్ సర్తాజ్ ఖాన్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో స్నేహభావాన్ని, పరోపకారాన్ని, సహకారాన్ని పెంపొందించే వినోదాత్మక క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థుల్లో స్నేహభావాన్ని పెంపొందించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్ బెహరా, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్ పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, పిఇటి కైలాస పండా తదితరులు పాల్గొన్నారు.


విప్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి- కవిటి

కవిటి నుంచి సముద్ర తీరానికి వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆలయ కమిటీ సభ్యులకు కోరారు. ఈ మేరకు శనివారం విప్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి టిడిపి నుంచి గతంలో రూ.10 లక్షలు మంజూరయ్యాయని, ఆ ప్రక్రియ వేగవంతం చేసి ఆలయ నిర్మాణానికి నిధులు సమకూరేలా చూడాలని కోరారు. దీనిపై విప్ అశోక్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు మొగలిపురి సీతారాం, బిపి రెడ్డి, బెందాలం సురేష్, పిదుర్యోధన, లాభాల లింగరాజు, పి.రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యమని పూర్వ కమిటీ అధ్యక్షులు మడ్డు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బైపల్లి సంఘం భవనంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రూ.34 లక్షలతో సభ్యులు భవనాన్ని నిర్మించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మోస లోకనాథం, సంయుక్త కార్యదర్శి అమర గురుమూర్తి, కోశాధికారి పరుసుపల్లి చంద్రశేఖర్, నూతన కమిటీ సభ్యులు చీగటి కామేశ్వరరావు, కోనేరు కామేశ్వరరావు, మడ్డు సుధీర్, కోడ పాపారావు, బొంపల్లి శివ, సీతారాం, మధు, లండ శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు సన్మానం

పలాస: ఎమ్మెల్యే గౌతు శిరీషను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు శనివారం ఘనంగా సన్మానించారు. తనకు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించేందుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుందర శ్రీకాకుళమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుందర శ్రీకాకుళం నిర్మాణమే లక్ష్యంగా నగర వాసులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పివివిడి ప్రసాదరావు అన్నారు. నగరంలోని సానావీధి, గాంధీనగర్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి, స్టార్ వాకర్స్‌క్లబ్ భాగస్వామ్యంతో హోమ్ కంపోస్ట్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా చెత్త సేకరణపై కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డస్ట్‌బిన్లను పంపిణీ చేసినప్పటికీ ప్రజలు వాటిని గృహ అవసరాలకు వినియోగించుకున్నారన్నారు. ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరు చేసే విధంగా మహిళల్లో చైతన్యం కల్పిస్తూ సహజ ఎరువు తయారీకి కార్యక్రమం రూపొందించామన్నారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి, స్టార్ వాకర్స్‌క్లబ్ భాగస్వామ్యంతో రెండు డస్ట్‌బిన్లను ప్రతి ఇంటికి అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



చెత్త డబ్బాలను అందజేస్తున్న కమిషనర్ ప్రసాదరావు

కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.సుధీర్ కుమార్, ఎఇ సృజన, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, జోనల్ చైర్మన్ శోభారాణి, అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, సెక్రటరీ మణిశర్మ, జెసిఐ సెక్రటరీ తమ్మినేని ఉషారాణి, స్టార్ వాకర్స్‌క్లబ్ గవర్నర్ పీజీ గుప్తా, అధ్యక్షులు శాసపు జోగినాయుడు, ఇందిరా ప్రసాద్, రవిశంకర్, డాక్టర్ కరణం హారికా, వినియోగదారుల సంఘం జిల్లా సెక్రటరీ నిహార్‌నాయుడు, దేవీప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న సిఐ ఈశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత సాంకేతిక కాలంలో సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంక్లూసివ్ సెంటర్, డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ సంయుక్తంగా సైబర్ సెక్యూరిటీ, సైబర్ లాస్‌మెంటల్ హెల్త్‌పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేఖ, డాక్టర్ సుజాత, ఐతం కాలేజీ ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ వై.రమేష్‌లు మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీపై కేస్ స్టడీని వివరిస్తూ ప్రలోభాలకు లోనై విలువైన సమాచారం, సంపద పోగొట్టుకున్న ఉందాంతాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇంక్లూసివ్ సెంటర్ కో-ఆర్డినేట్ డాక్టర్ ఆర్.రవిశంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ సత్యనారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై నెలరోజుల అవగాహన సదస్సుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ దేవేందర్, హైకోర్ట్ న్యాయవాది విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు, కార్మికులు, వలస కార్మికులు మత్తు పదార్థాలకు అలవాటు పడరాదని, దానివలన ఆరోగ్యంతో పాటు కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ నాగరాణి, ట్రస్టు చైర్మన్ రాంబాబు, డి.కృష్ణమూర్తి, నాగరాజు పాత్రో, కోట రామారావు, దుర్గాప్రసాద్, శ్రీరాములు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు


కవిటి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మత్స్యకారులకు అండగా..

ప్రజాశక్తి- కవిటి

మత్స్యకారులకు అండగా శ్రీ చింతామణి ఫుడ్ అసోసియేషన్ ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు పాండవ తారకేశ్వరరావు తెలిపారు. 2023 - 24 లో చేపల వేటకు వెళ్లి చనిపోయిన బారువ గ్రామానికి చెందిన రట్టి అప్పన్న, వలిశెట్టి పాపారావు, ఇసుకలపాలెంకు చెందిన పుక్కల ధర్మరాజు, డొంకూరుకు చెందిన రాజారావు కుటుంబాలకు చెరో రూ.10వేలు చొప్పున శనివారం ఆర్థికసాయం అందించారు. అనంతరం తారకేశ్వరరావు మాట్లాడుతూ చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులకు వేట సమయంలో ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి శ్రీ చింతామణి ఫుడ్ అసోసియేషన్ అండగా ఉంటుందని, ఆకోవలోనే వేటకు వెళ్లి మరణించిన మత్స్యకార సోదరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యత వేదిక సంఘం అధ్యక్షుడు బైపిల్లి మోహనరావు, బడే మాధవరావు, బాబూజీ, తులసయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలతో ఎన్నో అనర్థాలని 2వ పట్టణ ఎస్ఐ రామారావు అన్నారు. శనివారం కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, యువత మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్.ఐ రామారావు మాట్లాడుతూ యువతలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా డైరెక్టర్ బి.యస్.చక్రవర్తి పాల్గొని తమ సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ బృందం, ఎన్.ఎస్.ఎస్ పిఒ ఎం.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చరిత్ర స్మరించుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

మహనీయుల చరిత్రను విద్యార్థులు స్మరించుకోవాలని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బింధు మాధవి అన్నారు. గురజాడ అప్పారావు, జెసి బోస్ జయంతి వేడుకలు పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సామాజిక అసమానతల రూపుమాపితే, జెసి బోస్ మొక్కలకు భావవ్యక్తీకరణ తత్వం ఉందని చెబుతూ ప్రకృతిలో మొక్కల ప్రాధాన్యత వాటి అవసరాన్ని తెలియజేయడంలో చేసిన కృషి మరువలేనిదన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో ఎఒ ఎం.రాణి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థుల ఉన్నతికి గణితశాస్త్ర అధ్యాపకులు బి.వి.రమణమూర్తి ఎనలేని కృషి చేశారని ప్రిన్సిపాల్ జె.సునీత అన్నారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం గణితశాస్త్ర అధ్యాపకులు బాన్న వెంకటరమణమూర్తి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గణితశాస్త్ర అధ్యాపకులుగా ఆయన అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. అనంతరం వెంకటరమణమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రమణ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు శనివారం టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి విలియం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం డొంకాన పాపారావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి.శ్రీరామ్మూర్తి, కురమాన దాలయ్య, చౌదరి రవీంద్ర, ఎస్. కిషోర్ కుమార్‌లు ధర్మారావు, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, మల్లారెడ్డి పద్మనాభం పాల్గొన్నారు.


వెంకటరమణమూర్తి దంపతులను సత్కరిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

హోంగార్డుల సంక్షేమానికి సహకారం


ఎస్‌పితో డాక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల యోగ క్షేమాలను నిరంతరం చిత్తశుద్ధితో కాపాడుతూ పోలీసుశాఖలో తమవంతు పాత్ర పోషిస్తున్న హోంగార్డుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ప్రముఖ గైనికాలజిస్ట్, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం తరపున డాక్టర్ హారికతో జిల్లా ఎస్పి కె.వి మహేశ్వరరెడ్డిని కలిశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు తమ్మినేని రేవతి వైద్య చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం రూ.ఆరు లక్షలు ఖర్చు చేసి వైద్య చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి వారిని అభినందించారు. అనంతరం డాక్టర్ దానేటి మాట్లాడుతూ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ ప్రమాదానికి గురైన రేవతికి ఎటువంటి ఇన్సూరెన్స్ లేదని కుటుంబ సభ్యులు చెప్పడం ఆందోళనకు గురి చేసిందన్నారు. అందుకే తనవంతు సాయంగా హోంగార్డులకు ప్రతిఏటా రూ.రెండు లక్షలతో ఇన్సూరెన్స్ అందించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. జిల్లాలో 700 మంది హోంగార్డులకు ఈ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్‌ను, మెడికవర్ ఆస్పత్రి సెంట్రల్ హెడ్ సాగరికను, న్యూరాలజిస్ట్ మురళీధర్, పొన్నాడ శ్రీధర్ బాబులను ఎస్‌పి శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్ వివేకానంద తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువత ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ అన్నారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచడం, ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడం, వ్యాధికారక హెచ్ఐవికి వ్యతిరేకంగా పోరాటం కోసం ప్రపంచమంతటా ఈరోజు జరుపుకుంటున్నామన్నారు. ఈ వ్యాధిపై యువత అవగాహన కలిగి ఉండి ఎయిడ్స్ లేని భారతదేశంగా ఆవిష్కరించబడాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధని అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె. రాజారావు, ధనుంజయరావు, సురేష్ అధ్యాపకేతర సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు సనపల నర్సింగరావు, శ్యామసుందర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బర్న ప్రదాన్, రేణుకా, పద్మావతి, చంద్రవదన్, నిలిపి, అమితా, స్వప్నరాణి, ఉప్పాడ పాపారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలాస : ఎయిడ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ పి.మధు, రెడ్ రిబ్బన్ అధికారి బి.నరసింహులు, ఐఒఎసి కో-ఆర్డినేటర్ పి.వి.రమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎయిడ్స్ మహమ్మారి అనర్థాలను వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, ఎన్ఎస్ఎస్ పిఒ కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినైన పాపారావు పాల్గొన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వైద్య సేవలు మెరుగుపడాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలు మెరుగు పడేవిదంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన అడ్వైయిజర్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆస్పత్రిలో ఓపిని మరింత పెంచాలని వైద్యులు, సిబ్బంది ప్రజలకు రోగులకు అన్నివేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ మధుసూదనరావు, వైద్యాధికారి శిరీష, టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

వాసు మాష్టారు మృతి తీరని లోటు

పోలాకి: యారబాటి వాసు మాష్టారు మృతి టిడిపి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని వెదుళ్లవలసకు చెందిన వాసు మాస్టారు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ఎం. వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, యారబాటి ప్రవీణ్‌కుమార్, యారబాటి వేణు, భైరి భాస్కరరావు, కిల్లి వేణు ఉన్నారు.

భాష్యంలో సాంస్కృతిక దినోత్సవం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు భాష్యం పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 5వ తరగతి వరకు గల చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్ఇఒ శైలజ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డాన్స్ చేస్తున్న చిన్నారులు